సాక్షి
మెదక్

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



న్యాయం జరిగేనా?

జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఎదుట నేడు వక్ఫ్ బాధితులు తమ వాదనలు వినిపించనున్నారు.

వివరాలు 10లో ▸



ఏసీబీ వలలో కార్యదర్శి

ఇల్లు, విద్యుత్ మీటర్ పేరు మార్పునకు రూ.5 వేలు లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

వివరాలు 10లో ▸

ధృవపత్రాల పరిశీలన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: కాంట్రాక్టు పద్ధతిన ఉపాధ్యాయులను నియమించేందుకు శుక్రవారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ధృవపత్రాల పరిశీలన జరిగింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 2008లో డీఎస్సీ రాసి 70:30 నిష్పత్తిలో ఉద్యోగం రాని అభ్యర్థులు 292 మంది ఉండగా, వీరిలో మొదటి రోజు 132 మంది హాజరయ్యారు.

టీచర్ల సర్దుబాటు

కొనసాగుతున్న కసరత్తు

- రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు
- తొలిసారిగా విద్యాశాఖ నుంచి ఆదేశాలు



పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పాఠం బోధిస్తున్న ఉపాధ్యాయుడు

పాపన్నపేట(మెదక్): సర్కారు బడులను సంస్కరించే దిశగా సాగుతున్న ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మొన్న విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్.. నిన్న మండలానికో ఎంఈఓ.. నేడు టీచర్ల సర్దుబాటు నిర్ణయాలు.. విద్యాశాఖ బలోపేతం దిశగా వేస్తున్న అడుగులుగా చెప్పుకోవచ్చు. 2024 డీఎస్సీ ప్రక్రియ కొంత ఆలస్యమయ్యే పరిస్థితులు కనిపిస్తుండడంతో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ కోసం తొలిసారిగా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో పాఠశాలలో పరిమితికి మించి ఉన్న టీచర్లను మరో చోటుకు బదిలీ చేస్తున్నారు. మెదక్ జిల్లాలో సుమారు 145 మంది టీచర్ల తాత్కాలిక బదిలీకి రంగం సిద్ధమైంది.

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా..

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు ఉండాలి. కానీ తమకు అనుకూలమైన పాఠశాలల్లో పరిమితికి మించి ఉపాధ్యాయులు ఉన్నా, వారు అక్కడి నుంచి కదలడానికి ఇష్టపడడం లేదు. స్థానిక అవసరాలకనుగుణంగా ఎవరైనా టీచర్లను విద్యాశాఖ అధికారులు సర్దుబాటు చేసినా, వారు సంఘ నాయకులు, ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు చేసుకొని, ఉన్న స్థానాల నుంచి కదలడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో తొలిసారిగా సర్దుబాటు ప్రక్రియ కోసం విద్యాశాఖ నేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 10 మంది విద్యార్థులు ఉంటే ఒక టీచర్, 11 నుంచి 60కి ఇద్దరు, 61 నుంచి 90 ముగ్గురు, 91 నుంచి 120 నలుగురు, 121 నుంచి 150 ఐదుగురు, 151 నుంచి 200 వరకు ఆరుగురు, ఆపై ప్రతి 40 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను నియమించాలి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 6, 7 తరగతులున్న చోట 1 నుంచి 20 మంది విద్యార్థులకు ఇద్దరు, ఆపైన ఉంటే నలుగురు టీచర్లను నియమించాలి. ఉన్నత పాఠశాలల్లో 220 మంది వరకు ఏడుగురు టీచర్లు ఉండాలి. ఆపై ప్రతి 30 మందికి ఒక టీచర్ పెరుగుతారు.

జిల్లాలో సుమారు 145 మంది టీచర్లు..

ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో సుమారు 145 మంది ఉపాధ్యాయుల తాత్కాలిక బదిలీకి రంగం సిద్ధమైంది. అత్యధికంగా పాపన్నపేట మండలంలో 25 మంది, మెదక్‌లో 21, రామాయంపేట 17, కొల్చారంలో 8, హవేళీ ఘనాపూర్‌లో 10, నిజాంపేటలో 5, టేక్మాల్‌లో 2, వెల్దుర్తిలో 7, మాసాయిపేటలో 5, చేగుంటలో 4, తూప్రాన్‌లో 2, మనోహరాబాద్‌లో 6, చిన్నశంకరంపేటలో 7, నర్సాపూర్‌లో 11, కౌడిపల్లిలో 5, చిలప్‌చెడ్‌లో 3, అల్లాదుర్గంలో 4, పెద్దశంకరంపేటలో ఏడుగురు ఉపాధ్యాయులు బదిలీ అయ్యే అవకాశముంది.

> **త్వరలో ఉత్తర్వులు**
>
> 
>
> ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు జరుగుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి కనుగుణంగా, జీఓ నిబంధనలను బట్టి సమీప పాఠశాలలకు బదిలీ చేస్తాం. ఈ ప్రక్రియను ఆయా మండలాల ఎంఈఓలు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో పాఠశాలల్లో కొంత వరకు ఉపాధ్యాయుల సమస్య తీరనుంది.
>
> – రాధాకిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి

మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



రాందాస్ చౌరస్తాలో బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌జోన్/మెదక్ కలెక్టరేట్: మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో కుల బహిష్కరణలకు తావులేదని, ప్రజలంతా ఐక్యంగా ఉండటమే బాపూజీకి నిజమైన నివాళి అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని సంక్షేమ పథకాల్లో బీసీల వాటా తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. అలాగే పట్టణంలోని రామ్‌దాస్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నాగరాజుగౌడ్, జిల్లా ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి, సామాజిక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మెదక్‌జోన్: జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయని, వాటి ప్రాముఖ్యత గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ టూరిజాన్ని అభివృద్ధి చేయాలన్నారు. అంతకుముందు విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి జోజీ తదితరులు పాల్గొన్నారు.

'బాపూజీ'ది రాజీలేని పోరాటం



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంగారెడ్డి కలెక్టర్, నిర్మలారెడ్డి తదితరులు

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాజీలేని పోరాటాలు చేశారని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం బాపూజీ జయంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆయన విగ్రహానికి కలెక్టర్‌తో పాటు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పట్టణ పురపాలక సంఘం చైర్మన్ విజయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి జగదీష్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వయో వృద్ధుల సంక్షేమానికి కృషి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి జోన్: వయో వృద్ధుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ర్యాలీని కలెక్టరేట్‌లో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వృద్ధులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి సంరక్షణ పిల్లలదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధూరి, జిల్లా సంక్షేమాధికారి లలితాకుమారి, ఏఓ పరమేశ్, మెప్మా పీడీ గీత పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్: సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత వివరించి, వాటిని ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల నుంచి పిటిషన్ తీసుకొని వారికి న్యాయం అందేలా చూడాలన్నారు. ఆయన వెంట తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

సింగూరుకు పెరిగిన వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. ఐదు రోజులుగా క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 24,250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో 6, 11 గేట్లను రెండు మీటర్ల మేర ఎత్తి దిగువకు 21,467 క్యూసెక్కుల నీటిని, జల విద్యుత్ కేంద్రం ద్వారా 2,783 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జల విద్యుత్ కేంద్రంలో రెండు టర్బయిన్లు రన్ చేసి రోజూ 0.5 ఎంయూల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



పిల్లల సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి భవానిచంద్ర

సంగారెడ్డి టౌన్: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవాని చంద్ర అన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో పిల్లల సంరక్షణ, రక్షణ సహాయ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాయ సహాయం అవసరం ఉన్న వారికి ప్రతి శుక్రవారం ఈ కేంద్రంలో ఒక న్యాయవాదితో పాటు పారాలీగల్ వాలంటీర్ అందుబాటులో ఉంటారని చెప్పారు. బాల్య నేరస్తులను సాధారణ క్రిమినల్ కోర్టుకు తరలించకుండా ప్రత్యేక కోర్టుగా పనిచేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేష్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

సంగారెడ్డి: రైతుల మేలు కోసం డీసీఎంఎస్ కృషి చేస్తుందని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ అన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని సహకార సంఘాల మహాజన సభ నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు డీసీఎంఎస్ వ్యాపార అభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అరిగె రమేష్ కుమార్, మా ర్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్, డీసీసీబీ సీఈఓ శ్రీనివాస్, డీసీఎంఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

రేపు 'భగీరథ' నీటి సరఫరాలో అంతరాయం

- ఏఈ రాజ్‌కుమార్

నర్సాపూర్: ఈనెల 29వ తేదీన మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ పథకం ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని సుమారు 500 గ్రామాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. చక్రియాల వద్ద మెయిన్ పైపులైన్‌కు మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. సోమవారం నుంచి యథావిధిగా నీటి సరఫరా ఉంటుందని పేర్కొన్నారు.

పేదలపై 'హైడ్రా' పగ

సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీ నేతలు, పలుకుబడి ఉన్న వారికి నోటీసులతో సరిపెడుతున్న సర్కారు, పేదోడి గూడుపై మాత్రం కర్కశంగా వ్యవహరిస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. దమ్ముంటే అనుమతి ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. ఇల్లు కట్టుకోవడానికి అనుమతి ఇచ్చి, వాటి నుంచి వచ్చిన ఆదాయాన్ని సొమ్ము చేసుకొని మళ్లీ వాటినే కూల్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదలు రూపాయి రూపాయి కూడబెట్టి స్థలం కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకుంటే వారిని రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాపం ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. వర్షం నీరు రోడ్ల మీద నిల్వ కూడదంటే డ్రైనేజ్ వ్యవస్థ బలంగా ఉండాలన్నారు. ఇప్పటికైనా పేద, మధ్య తరగతి కుటుంబాలకు హైడ్రా భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

డైట్ కళాశాల తనిఖీ

హవేళిఘణాపూర్(మెదక్): హవేళిఘణాపూర్ డైట్ కళాశాలను శుక్రవారం ఎస్‌ఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ తనిఖీ చేశారు. విద్యాబోధన, తదితర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. డైట్ కళాశాలలో ఉర్దూ కోర్సు ఉన్నప్పటికీ బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. అనంతరం మెదక్ మండల పరిధిలోని మాచవరం జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు అందుతున్న విద్యాబోధన గురించి ఆరా తీశారు. ఆయనతోపాటు డీఈఓ రాధాకిషన్, డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, ఎంఈఓలు నీలకంఠం, సుదర్శనమూర్తి ఉన్నారు.

విద్యార్థుల చేతిలోనే దేశ భవిష్యత్



విజేతలతో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రపంచ దేశాలకు విద్యను అందించిన ఘనత మన దేశానికే దక్కుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని విద్యాభారతి పాఠశాలలో జరిగిన సరస్వతి శిశుమందిర్ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోని అనేక దేశాలు మన సంస్కృతి, సంప్రదాయాలను పాటిస్తుంటే, ఇక్కడ కొంతమంది పాశ్చాత్య సంస్కృతి వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రపంచ దేశాలకు విద్యను అందించిన నలంద యానివర్సిటీకి పూర్వ వైభవం తీసుకువస్తుందన్నారు. విద్యార్థుల పైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని.. తల్లిదండ్రులు ఇష్టమైన రంగాల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం దక్షిణ మధ్యప్రాంతం అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు, సుధాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్, అవధానులు తదితరులు పాల్గొన్నారు.

యేసయ్య క్షేత్రం.. జన సంద్రం



ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చిలో (సీఎస్‌ఐ) చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సంఘం 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు బిషప్ డాక్టర్ కె. రూబెన్ మార్క్ దైవ సందేశం ఇచ్చారు. అనంతరం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తో కలిసి మిషన్ ఆస్పత్రిని ప్రారంభించారు. భక్తులతో చర్చి ప్రాంగణం కిటకిటలాడింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. –మెదక్‌జోన్

మరి వాటి సంగతి?

- మల్కాపూర్ పెద్ద చెరువులో మరిన్ని అక్రమ కట్టడాలు
- బఫర్, ఎఫ్‌టీఎల్‌లో గెస్ట్‌హౌస్‌లు, రియల్ ఎస్టేట్ నిర్మాణాలు
- యుద్ధ ట్యాంకుల పరీక్షకు వేదిక ఇదే చెరువు..



మల్కాపూర్ పెద్ద చెరువులో అధునాతన యుద్ధ ట్యాంకుల ట్రయల్‌రన్ (ఫైల్)

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: మల్కాపూర్ పెద్ద చెరువులో బహుళ అంతస్తుల భవనాన్ని డిటోనేటర్లతో జలసమాధి చేసిన జిల్లా అధికార యంత్రాంగం.. ఇదే చెరువులో మరిన్ని అక్రమ కట్టడాల జోలికి మాత్రం వెళ్లలేదు. ఈ చెరువు బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిలోనే బడాబాబుల గెస్ట్ హౌస్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్ల నిర్మాణాలు ఉన్నాయి. ఒక్క భవనాన్ని మాత్రమే కూల్చివేసిన అధికారులు వీటి జోలికి వెళ్లకపోవడం పలు ఆరోపణలకు దారితీస్తోంది. అమీన్‌పూర్, పటాన్‌చెరుకే పరిమితమైన అక్రమ నిర్మాణాల కూల్చివేతలు గురువారం మిగిలిన ప్రాంతాల్లో కూడా షురూ కావడం జిల్లాలో కలకలం రేపింది. హెచ్ఎండీఏ యేతర మండలాల్లో కూడా ఈ కూల్చివేతల ప్రక్రియ ప్రారంభం కావడం సర్వత్రా చర్చనీయాంశమవుతోంది.

వత్తాసుపలికిన ఇరిగేషన్ అధికారులు

ఈ చెరువు సమీపంలోనే లేక్‌వ్యూ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ వెంచర్ వెలిసింది. ఏకంగా చెరువులోనే ప్రహరీ నిర్మించారని నీటిపారుదల శాఖ అధికారులే చెబుతున్నారు. అలాగే బడాబాబులు ఇదే చెరువు బఫర్‌జోన్‌లో భారీ విస్తీర్ణంలో గెస్ట్‌హౌస్ నిర్మించుకున్నారు. ప్రజాప్రతినిధులు, నేతల కనుసన్నల్లో జరిగిన ఈ అక్రమ నిర్మాణాల జోలికి నీటి పారుదల శాఖ అధికారులు ఐదేళ్లుగా వెళ్లలేదు. పెద్ద మొత్తాల్లో ముడుపులు పుచ్చుకుని వాటికి ఎన్‌ఓసీలు సైతం జారీ చేసి వత్తాసు పలికారు. ప్రజాప్రతినిధులు, నేతల అడుగులకు మడుగులొత్తిన ఈశాఖ అధికారులు చెరువు మధ్యలో నిర్మాణాలు జరిగినా కనీసం పట్టించుకోలేదు. ప్రభుత్వం అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో కూల్చివేతలు తప్పనిసరి కావడంతో మామూళ్లు తీసుకుని వత్తాసు పలికిన అధికారులు ఇప్పుడు ఇరకాటంలో పడ్డారనే గుసుగులు వినిపిస్తున్నాయి.

ఈ చెరువులోనే పరీక్షలు..

మల్కాపూర్ పెద్ద చెరువుకు ఓ ప్రత్యేకత ఉంది. దేశ రక్షణ శాఖకు సంబంధించిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేసే అధునాతన యుద్ధ ట్యాంకులను ఈ చెరువులోనే పరీక్షలు చేస్తుంటారు. భూమి, నీళ్లలో ఉభయచర యుద్ధ ట్యాంకుల ట్రయల్‌రన్‌కు ఈ చెరువే వేదిక. ఏటా ఓడీఎఫ్ అధికారులు ఇక్కడ ప్రదర్శన కూడా నిర్వహిస్తుంటారు. అలాంటి ప్రత్యేక ఉన్న చెరువులో కళ్ల ముందే అక్రమ నిర్మాణాలు వెలుస్తుంటే మామూళ్లు పుచ్చుకుని అధికారులు చేష్టలుడిగి చూడటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.

> **వారిని సంప్రదించి కూల్చివేస్తాం**
>
> 
>
> మల్కాపూర్ పెద్ద చెరువులో మరికొన్ని అక్రమ కట్టడాలు ఉన్నట్లు మా దృష్టిలో ఉంది. గెస్ట్‌హౌస్‌లు, రియల్ ఎస్టేట్ వెంచర్ వాళ్లు చెరువు చుట్టూ పెద్ద ప్రహరీ నిర్మించారు. త్వరలో రెవెన్యూ అధికారులను సంప్రదించి వాటిని కూల్చివేస్తాం.
>
> – బాలగణేష్, డిప్యూటీ ఇంజినీర్, నీటిపారుదలశాఖ

> **నివేదిక రాగానే నోటీసులు**
>
> చెరువులో వెలిసిన అక్రమ కట్టడాల విషయంలో నీటి పారుదల శాఖ నుంచి నివేదిక రావాల్సి ఉంది. అధికారులు నివేదిక ఇచ్చిన వెంటనే వాటి యజమానులకు నోటీసులు జారీ చేస్తాం. అక్రమ నిర్మాణం అని తేలితే తప్పకుండా కూల్చివేస్తాం.
>
> – అనిత, కొండాపూర్ తహసీల్దార్

క్లుప్తంగా

ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా శ్రీకాంత్


శ్రీకాంత్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పాపన్నపేట(మెదక్): ఉత్తమ ఫొటోగ్రాఫర్‌గా పాపన్నపేటకు చెందిన పుర్ర శ్రీకాంత్ ఎంపిక య్యారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీకాంత్‌కు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రశంసాపత్రంతోపాటు మెమోంటో అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న చారిత్రక స్థలాలు, పర్యాటక కేంద్రాలు, ఎకో టూరిజం అంశాలపై ఫొటోలు తీయించగా శ్రీకాంత్ ఏడుపాయల క్షేత్రం దారిలోని రోడ్డు మలుపులు, గుట్టలు, మంజీరా నది పాయలను ఆకట్టుకునేలా తీశారు. దీంతో ఆయనకు ఉత్తమ అవార్డు దక్కింది. ద్వితీయ బహుమతి మెదక్ చెందిన ఈశ్వర్, తృతీయ బహుమతి దర్శన్‌కు, నాల్గో బహుమతి పాపన్నపేట మండలం ఎల్లాపూర్‌కు చెందిన ప్రతాప్‌కు దక్కింది.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ

ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ రమేశ్ సరియల్

పాపన్నపేట(మెదక్): ఎన్‌సీసీతో విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ ఏర్పడుతుందని ఆర్మీ కమాండింగ్ ఆఫీసర్ రమేశ్ సరియల్ అన్నారు. శుక్రవారం పాపన్నపేటలోని ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల పరేడ్ పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు ఎన్‌సీసీలో చేరితే అనేక ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. దేశ సేవ చేయాలనుకునే వారికి ఎన్‌సీసీ ఒక ప్లాట్ ఫామ్‌లా ఉపయోగపడుతుందన్నారు. పోటీ పరీక్షలకు, పోలీస్ లాంటి ఉద్యోగాలకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు తోడ్పడుతాయని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్వర్, టీచర్లు నాగరాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

9 మంది అరెస్ట్

పటాన్‌చెరుటౌన్: పేకాట స్థావరంపై పోలీసుల దాడులు నిర్వహించిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బొల్లారం పరిధిలోని ఖాజీపల్లి సర్వే నంబర్ 181 అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు శుక్రవారం దాడులు నిర్వహించాం. ఈ దాడుల్లో 9 మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.14 వేలు, 8 బైక్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రేమించి.. పెళ్లికి నిరాకరించి

యువతిని మోసం చేసిన యువకుడిపై కేసు


తొగుట(దుబ్బాక): ప్రేమిస్తున్నానని యువతికి మాయ మాటలుచెప్పి మోసం చేసిన యువకుడిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన చిలువేరి నరేశ్‌గౌడ్ మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన ఓ యువతిని మూడేళ్లుగా ప్రేమిస్తూ పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించాడు. ఆమె వద్ద ఆరు తులాల బంగారం, రూ 2.30 లక్షలు తీసుకున్నాడు. అనంతరం పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. పంచాయతీ పెద్ద మనుషులతో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. దీంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా నరేశ్‌గౌడ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యాయం జరిగేనా?

నేడు జేపీసీ ఎదుట వక్ఫ్ బాధితుల వాదనలు

- జహీరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా 13 వేల ఎకరాలు వక్ఫ్ కిందకు
- క్రయ విక్రయాలు నిషేధం, చేతులెత్తేసిన రెవెన్యూ యంత్రాంగం
- ఆందోళన చెందుతున్న గిరిజన రైతాంగం

వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి చట్ట సవరణ చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఎదుట బాధితులు తమ వాదనలు వినిపించనున్నారు. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్‌లోని తాజ్ హోటల్‌లో సమావేశం కానున్నారు. జహీరాబాద్ మండలం సత్వార్, కోహీర్ మండలంలోని కోహీర్, పిచరాగడి తండాలకు చెందిన భూ బాధితులు ఈ సమావేశంలో పాల్గొని కమిటీ సభ్యులతో తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు.


పిచరాగడి తండా

జహీరాబాద్: జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 13,500 ఎకరాల భూములను వక్ఫ్ కింద చూపుతున్నారు. ఈ భూముల్లో 90 శాతానికి పైగా భూములను రైతులు తాత ముత్తాతల కాలం నుంచి సాగు చేసుకుంటూ వస్తున్నారు. తాజాగా వీటిని వక్ఫ్ కింద చూపడం అన్యాయమని రైతులు అంటున్నారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారానే తమకు న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని అన్ని వర్గాలకు చెందిన రైతులు వ్యక్తం చేస్తున్నారు. చట్ట సవరణకు ఎదుట దేశ వ్యాప్తంగా ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు కేంద్రం జాయింట్ పార్లమెంట్ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులు పలు రాష్ట్రాల్లో పర్యటించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు.

ఆ తండా భూములన్నీ వక్ఫ్ కిందకే

కోహీర్ మండలంలోని పిచరాగడి తండాకు చెందిన భూములన్నీ వక్ఫ్ భూములుగా చూపుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తండాకు చెందిన 150 మందికి పైగా గిరిజన రైతులకు సంబంధించిన సుమారు 500 ఎకరాలు వక్ఫ్ కిందకు చేర్చారు. తండాలో ఉన్న రైతులంతా చిన్న సన్నకారులే. తండాను కలుపుకొని పిచరాగడి గ్రామంలో 3,276.18 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. ఇందులో వక్ఫ్ కింద 2,182 ఎకరాలకు పైగా భూములు ఉన్నట్లు చూపుతున్నారు. దీంతో పిచరాగడి రెవెన్యూ గ్రామంలో 70 శాతం భూములు వక్ఫ్ కిందకు చేరుతున్నాయి. కోహీర్ గ్రామ పంచాయతీ పరిధిలో 3,366 ఎకరాలు, కవేలిలో 733 ఎకరాలు, కొత్తూర్(కె)లో 536 ఎకరాలు, మధిరిలో 400 ఎకరాలు, మొగుడంపల్లి మండలం ధనాసిరిలో 239 ఎకరాలు, గుడ్‌పల్లిలో 103 ఎకరాలు, మాడ్గిలో 261 ఎకరాలు, జహీరాబాద్ మండలం సత్వార్‌లో 877 ఎకరాలు, ఝరాసంగం మండలం చిల్కేపల్లిలో 213 ఎకరాలు, రాయికోడ్ మండల కేంద్రంలో 967 ఎకరాల మేర భూములను వక్ఫ్ కింద చూపుతున్నారు.

ప్రభుత్వ మారడంతో కొలిక్కిరాని సమస్య

2001 గెజిట్‌లో వక్ఫ్ భూములు అని ఎలా వస్తుందని న్యాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 1939 నుంచి రైతుల వద్ద, రెవెన్యూ శాఖ వద్ద సాగు చేస్తున్న భూములకు సంబంధించిన రికార్డులన్నీ ఉన్నాయి. ఇది ముమ్మాటికి వాస్తవమైన విషయమనేది అధికారులందరికీ తెలిసినప్పటికీ ధరణి సాకుతో రైతులకు న్యాయం చేయలేని పరిస్థితి. వక్ఫ్ భూ బాధితులు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి సమస్యను చెప్పుకోగా ప్రత్యేక అధికారిని నియమించి పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అంతలోనే వారి ప్రభుత్వం పోవడంతో సమస్య అక్కడే ఉండి పోయింది. తమకు పట్టా పాస్‌బుక్కులు ఉన్నా లేనివారిగానే పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2005 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఫైనల్ పట్టా సర్టిఫికెట్లు జారీ చేశారని రైతులు గుర్తు చేస్తున్నారు.

ధరణికి ముందు రైతులవే..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ ప్రవేశపెట్టక ముందు అన్ని భూములను రైతులు సవ్యంగా అనుభవిస్తూ వచ్చారు. అనంతర పరిణామాలతో రైతుల భూము లు వక్ఫ్ భూములుగా మారిపోయాయి. సమస్య పరిష్కరించాల్సిందిగా తహసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్‌లను ఆశ్రయించినా నిరాశే ఎదురైంది. 1995 వక్ఫ్ చట్టం ప్రకారం ఏదైనా ఆస్తి ముస్లింలకు, వారి మతానికి సంబంధించినదిగా భావిస్తే వక్ఫ్ బోర్డు దాన్ని ఎలాంటి విచారణ లేకుండా స్వాధీనం చేసుకోవచ్చు. అది ముస్లిం మతానికి చెందినది కాదని నిరూపించే బాధ్యత బాధితుడిదే. కోర్టులకు కాకుండా వక్ఫ్ బోర్డులో ఉండే ముస్లింలకే బాధిత రైతులు నిరూపించాలి. ఇలాంటి పరిస్థితుల్లో వక్ఫ్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించినా కూడా ఫలితంలో ఎలాంటి మార్పు ఉండదని భావించి రైతులు కుమిలిపోతున్నారు.

ఐదు ఎకరాలు వక్ఫ్ కిందే



నాకు పిచరాగడి తండాలో ఐదు ఎకరాల భూమి ఉంది. ఇది మా పెద్దల తరం నుంచి సాగు చేసుకుంటూ వస్తున్నాం. ఈ భూమిని వక్ఫ్ కింద చూపుతున్నారు. దీంతో రైతు బంధు పొందలేక పోతున్నా. బ్యాంకులో పంట రుణాలు కూడా ఇవ్వడం లేదు. పండించిన పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను తీసుకెళ్తే కొనుగోలు చేయడం లేదు. గిరిజన తండా భూములను వక్ఫ్ కింద చూపడం ఎంతవరకు న్యాయం. అవసరాలకు అమ్ముకుందామన్నా నిషేధ భూముల కింద చేర్చారు.

– చవాన్ చందర్, బాధిత రైతు, పిచరాగడి తండా

నిషేధిత జాబితాలో చేర్చారు



తాత ముత్తాతల కాలం నుంచి భూములను సాగు చేసుకుంటూ వస్తున్నాం. ఇప్పుడు ఈ భూమిని నిషేధిత జాబితాలో చేర్చారు. ఇలా చేర్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా తండాలో ఉన్న భూముల్లో 80 శాతం మేర వక్ఫ్ భూములుగా చూపుతున్నారు. నాకున్న 2.30 ఎకరాల భూమి మొత్తం నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను పొందలేక పోతున్నాం. తండ్రి మరణిస్తే కుమారుడి పేరిట పట్టా మార్చడం లేదు.

– మేఘనాథ్, బాధిత రైతు, పిచరాగడి తండా

ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులు

- కఠిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు


కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దుబ్బాక : పట్టణంలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమానికి రాజకీయ పార్టీ నాయకులను ఆహ్వానిస్తూ ప్రొటోకాల్ ఉల్లంఘించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లకు బీఆర్‌ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దుబ్బాక మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్‌రెడ్డి, సాయిరాం, కిషన్‌రెడ్డి, రాంరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమంలో ఫ్లెక్సీలో ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత ఫొటోలు పెట్టకపోవడంతోపాటు కనీస సమాచారం ఇవ్వలేదన్నారు. ప్రొటోకాల్ ఉల్లఘించి కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డిని స్టేజీ పైకి పిలిచి కూర్చోబెట్టడడం సిగ్గుచేటన్నారు. అధికారులు, పోలీసులు కాంగ్రెస్ నాయకులకు వత్తాసు పలుకుతూ బీఆర్‌ఎస్ దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణపై జులుం ప్రదర్శిస్తూ స్టేజీపై నుంచి కిందికి తోసేయడం దారుణమన్నారు. ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడి శాంతిభద్రతకు విఘాతం కల్గించిన అధికారులపై చర్యలు తీసుకొని మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో మోహన్‌లాల్, కైలాసం, శేఖర్‌గౌడ్, స్వామి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- ఇంటి పేరు మార్పు కోసం డబ్బులు డిమాండ్
- రూ.5 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ అధికారులు


పంచాయతీ కార్యదర్శి షకీల్

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటి పేరు మార్పు కోసం రూ.5 వేలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ మెదక్ రేంజ్ డీఎస్పీ సుదర్శన్ కథనం మేరకు.. కొండాపూర్ గ్రామానికి చెందిన మాచెపల్లి అప్సర్ తన తమ్ముడు పేరు మీద ఉన్న ఇల్లును తనకు రావడంతో ఆ ఇంటిని తన పేరు మీద మార్పు చేయాలని కోరుతూ ఆగస్టు 24న పంచాయతీ కార్యదర్శి షకీల్‌ను కలిసి దరఖాస్తు చేసుకున్నారు. పేరు మార్పు చేయాలంటే రూ.25 వేల అవుతుందని, నీవు పేద వాడివి కాబట్టి రూ.7 వేలు ఇస్తే మార్పు చేస్తానన్నాడు. బాధితుడు అంత ఇవ్వలేనని రూ.5 వేలు ఇస్తానన్నాడు. అనంతరం ఈ నెల 21వ తేదీన ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం ఎంఈఓ కార్యాలయం వద్ద బాధితుడి నుంచి షకీల్ రూ.5 వేలు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నామన్నారు. విచారణ అనంతరం పంచాయతీ కార్యదర్శిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టుకు తరలించారు.

రెండేళ్ల కిందట సంగారెడ్డి జిల్లాకు..

షకీల్ పంచాయతీ కార్యదర్శిగా గతంలో మహబూబ్‌నగర్‌లో విధులు నిర్వహించే వాడు. అయితే 316 జీఓ బదిలీలో భాగంగా రెండేళ్ల కిందట సంగారెడ్డి జిల్లా, కొండాపూర్ మండల కేంద్రానికి పంచాయతీ కార్యదర్శిగా బదిలీపై వచ్చాడు. బదిలీపై వచ్చినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శి పై అనేక ఆరోపణలు ఉన్నాయి. పింఛన్‌ల కోసం దరఖాస్తు, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఇంటి పేరు మార్పు, ఇల్లు పర్మిషన్ ఇలా ప్రతీ పనికి ఒక రేటును నిర్ణయించుకొని వసూళ్లకు పాల్పడ్డాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పోరాటశీలి కొండా లక్ష్మణ్ బాపూజీ


కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: కొండా లక్ష్మణ్ బాపూజీ నిరంతర పోరాటశీలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 109వ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజారాంతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన పోరాట పటిమ మరువలేనిదన్నారు. న్యాయవిద్య అభ్యసించి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పి తెలంగాణ విముక్త పోరాటంలో పాల్గొన్నాడన్నారు. మలిదశ ఉద్యమంలో రాష్ట్ర ఆకాంక్ష కోసం పూర్తి సహాయ సహకారాలు అందించారని, రాష్ట్ర ఏర్పాటు స్వప్నం నెరవేరిన వేళ ఆయన లేకపోవడం దురదృష్టకరమన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు దుర్గాప్రసాద్, గాడిపల్లి శ్రీనివాస్, మున్సిపల్ పాలకవర్గం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజు ఆవాలతో కొండా లక్ష్మణ్ బాపూజీ రూపాన్ని చిత్రించి నివాళులర్పించారు.

అందరి కృషితో లక్ష్యాన్ని చేరుకున్నాం

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత, సిద్దిపేట డీఎం సుఖేందర్‌రెడ్డి
- సిబ్బందికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేత


సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఆర్‌ఎం ప్రభులత, డీఎం సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేటకమాన్: అందరి కృషితోనే లక్ష్యాన్ని అందుకున్నామని ఆర్టీసీ రీజినల్ (ఆర్‌ఎం) మేనేజర్ ప్రభులత, సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి అన్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలోనే సిద్దిపేట బస్‌డిపో మూడవ ఉత్తమ డిపోగా నిలవడంతో ఇటీవలె రూ.2లక్షల నగదు బహుమతి రావడంపై సిద్దిపేట డిపోలో శుక్రవారం సిబ్బందితో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌ఎం ప్రభులత హాజరయ్యారు. డీలక్స్ బస్సుల్లో ప్రయాణించడం ద్వారా లక్కీ డ్రాలో గెలుపొందిన ముగ్గురు మహిళా ప్రయాణికులకు ఆర్‌ఎం, డీఎంలు చీరలు బహుమతిగా అందజేశారు. అదే విధంగా సిద్దిపేట, దుబ్బాక డిపోలో కేటగిరి వారీగా ఉత్తమ పనితీరు కనబర్చిన 46 మంది డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. రూ.2లక్షల నగదు బహుమతి రావడంతో డిపోలోని సుమారు 400 మంది ఉద్యోగులకు లంచ్ బాక్స్‌లను బహుమతిగా అందజేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని 8 డిపోలు కేవలం ఐదు నెలల వ్యవధిలో రూ.28.85 కోట్ల లాభాలు అర్జించాయన్నారు. సిద్దిపేట డిపో రూ.8.45 కోట్లు, దుబ్బాక డిపో రూ.2.82 కోట్లు లా భాలు ఆర్జించిందన్నారు. ఇదే స్ఫూర్తిని రాబోయే సీజన్‌లో కూడా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, సూపర్‌వైజర్లు, సిబ్బంది మౌలానా ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి యువకుడు, ట్రక్ ఢీకొని మహిళ

వేర్వేరు చోట్ల ఇద్దరు మృతి



అజి (ఫైల్)

తూప్రాన్: చెరువులో స్నానానికి వెళ్లిన యువకుడు నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని యావపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం కథనం మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల అజి(28) గ్రామ సమీపంలోని చెరువులోకి గురువారం సాయంత్రం స్నానానికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. చెరువు వద్ద అజి చెప్పులు కనిపించడంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మెదక్ మున్సిపాలిటీ: ట్రక్ ఢీకొని మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. మెదక్ పట్టణంలోని నవాబుపేట వీధికి చెందిన షాహీదాబేగం(70) శుక్రవారం రాందాస్ చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా కాంక్రీట్ మిక్సింగ్ ట్రక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అమె అక్కడికక్కడే మృతి చెందింది. పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంజనీరింగ్ కళాశాల బస్సులు ఢీ

- ఓ డ్రైవర్ మృతి, మరో బస్సు డ్రైవర్ పరిస్థితి విషమం
- 20 మంది విద్యార్థులకు గాయాలు


నాగరాజు (ఫైల్)



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సులు

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు శుక్రవారం ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ మృతి చెందగా, మరో బస్సు డ్రైవర్‌తోపాటు సుమారు 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం మేరకు.. హైదరాబాద్ మియాపూర్ నుంచి బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన సుమారు 40 మంది విద్యార్థులను తీసుకెళ్తుంది. ఇదే కాలేజీకి చెందిన మరో బస్సు నర్సాపూర్ పట్టణంలోని విద్యార్థులను తీసుకెళ్లేందుకు వస్తుంది. నర్సాపూర్- సంగారెడ్డి రహదారిలోని శ్రీ రేణుక ఎల్లమ్మ గుడి సమీపంలో రాగానే రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ బస్సు డ్రైవర్ నాగరాజు (52) మృతి చెందగా, మరో బస్సు డ్రైవర్ యాదగిరికి తీవ్ర గాయాలు అయ్యాయి. 20 మంది విద్యార్థులకు తవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను నర్సాపూర్, హైదరాబాద్, సంగారెడ్డి ఆస్పత్రులకు తరలించారు. మృతుడు నాగరాజు పటాన్ చెరువు మండలం బీరంగూడ లోని చైతన్య కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్ - సంగారెడ్డి రహదారిలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్లియర్ చేయించారు.

ధరణి సమస్యలు పెండింగ్ పెట్టొద్దు

సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి


గురుకుల పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్: తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి ఫైల్స్ పెండింగ్‌లో పెట్టొద్దని కలెక్టర్ క్రాంతి వల్లూరి అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ మండలాల్లోని సమస్యలను తహసీల్దార్లు వెంటనే పరిష్కరించాలన్నారు. ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు తహసీల్దార్ కార్యాలయం నుంచి పంపించే ఫైళ్లకు అన్ని ధ్రువపత్రాలు జతచేసి పంపించాల్సిందిగా సూచించారు. ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలను ఆమె సందర్శించారు. విద్యాబోధన జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.

జలపాతం అందాలను ఆస్వాదించిన కలెక్టర్

రాష్ట్ర సరిహద్దులో ఉన్న జలపాతాన్ని కలెక్టర్ క్రాంతి వల్లూరి సందర్శించి ఆస్వాదించారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలో ఆమె పర్యటించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని సమీపంలో ఉన్న జాడీమల్కాపూర్ గ్రామ శివారులోని జలపాతం ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా మలిచేందుకు గల అవకాశాల గురించి చూశారు. జలం ఎక్కడి నుంచి వస్తున్నది, ఎక్కడకు చేరుతుందనే విషయాలను రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు మాధురి, చంద్రశేఖర్, ఆర్డీఓ రాజు, తహసీల్దార్ హసీన, ఆర్ఐ సాయికిరణ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలు, జరిమానా

వర్గల్(గజ్వేల్): ఇళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుడికి శుక్రవారం గజ్వేల్ కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించినట్లు గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన వల్లపు రాజు ఆగస్టు 8న అదే గ్రామంలో పలు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి నెల 30న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పరిశోధన అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ వేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి శుక్రవారం గజ్వేల్ కోర్టు న్యాయమూర్తి బి.ప్రియాంక ఏడాది జైలు శిక్ష, రూ.4,000 జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై కరుణాకర్‌రెడ్డి, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురు ఆత్మహత్య

శుక్రవారం ఒక్క రోజే వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ములుగులో భర్తతో గొడవపడి భార్య, కల్హేర్‌లో పెళ్లి అయిన ఆరు నెలలకు వివాహం ఇష్టం లేదని వివాహిత, పటాన్‌చెరులో మనస్తాపంతో మరో మహిళ బలవన్మరణానికి పాల్పడ్డారు.

భర్తతో గొడవపడి భార్య..


మమత (ఫైల్)

ములుగు(గజ్వేల్): చెరువులో దూకి వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ములుగు మండలం క్షీరసాగర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. క్షీరసాగర్ గ్రామానికి చెందిన మమత(22)కు రావణకోల్ గ్రామానికి చెందిన తరిగొప్పుల నర్సింలుతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి మూడేళ్ల కూతురు ఆదిత్యఉంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో మమత క్షీరసాగర్‌లోని తల్లిగారి ఇంటికొచ్చి ఉంటుంది. 2 నెలలుగా ములుగులోని అటవీ కళాశాలలో వంట పని చేసేందుకు వెళ్తుంది. రోజు మాదిరిగా 24న వంట పనికి వెళ్లిన మమత తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళనకు గురైన తండ్రి రమేశ్ ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. ఈ క్రమంలోనే మండలంలోని జప్తి సింగాయిపల్లి గ్రామ మర్రికుంట చెరువులో శుక్రవారం మమత శవమై తేలింది. దంపతుల మధ్య గొడవలు, భర్త కాపురానికి తీసుకపోవడం లేదనే మనస్తాపంతో మమత ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మనస్తాపంతో కోడలు..

పటాన్‌చెరు టౌన్ : బీపీ మాత్రలు వేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం పోచారం గ్రామానికి చెందిన డప్పు అనూష(38) అత్త బాలమ్మకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. చేతికి గాయం కాగా నన్ను ఆస్పత్రికి ఎందుకు తీసుకెళ్లడం లేదని బాలమ్మ కోడలు అనూషను అడిగింది. దీంతో మనస్తాపానికి గురైన ఆమె గురువారం మధ్యాహ్నం అత్త బీపీ మాత్రలు వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. భర్త సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పెళ్లయిన ఆరునెలలకు వివాహిత..

కల్హేర్(నారాయణఖేడ్): పెళ్లయిన ఆరు నెలలకే ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజాంపేట్ మండలం ఖానాపూర్(బి)లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మాందపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి(21)కి ఖానాపూర్(బి)కు చెందిన నమ్మిళ్ల హన్మండ్లుతో ఆరు నెలల కిందట వివాహమైంది. పెళ్లి ఇష్టం లేకపోవడం, కుటుంబ కలహాలతో వైష్ణవి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెంకటేశం తెలిపారు.